# నువ్వూ మీ ఆవిడా వేరే ఉండండిరా!

కుమారి రేమణి స్వరాజ్యలక్ష్మి

అన్నాడంటే అనడూ తప్పా? లేకపోతే ఏమిటి వీడి గొప్పతనం వీడూను? నెత్తిమీద రూపాయి పెట్టి, కానీకి వేలంవేస్తే కొనేనాధుడు వుండడు, అధార్టీ చెలాయిస్తాడా, వీడి అధార్టీ వీడూ.......దాదాపు ముప్పై ఏళ్ళు నెత్తి మీదికొచ్చాయి. ఎర్రని ఏగానీ సంపాదన లేదు ముం....ల్లే మూల కూచోటం తప్ప. అట్టాంటిది వేళకింత పెట్టింది తిని కుక్కన పేనల్లే పడివుండక యిల్లెగిరిపోయేటట్టు హుకుం చేస్తాడా? ఏం చూసుకుని నాయనా యీ ఎగురుడు- అసలు శాస్త్రం వుండనే వుండిగా "అన్నీ వున్న విస్తరి అణిగే వుంటుంది. ఏమీలేనిదే ఎగిరెగిరి పడుతుందని........"

"అసలు యింతకీ యిదంతా ఆ ముసలాయనచేసాడు. వెధవాయిని ఆ స్కూలు ఫైనలు అయిపోగానే చదువు మానిపించవయ్యా మహారాజా-యీ బి. ఎ.లు, ఎం.ఎ, లు చదవటమే గాని ఆనక ఏం ప్రయోజనం వుండదు. వున్నది కాస్తా తెగనమ్మి అబ్బాయిగార్ని చదివిస్తే ఆనక మన మాట కూడా వినకుండా పోతాడండీ" అని నేను నెత్తిన నోరు పెట్టి మొత్తుకుంటె విన్నాడూ? ఎప్పటి మాదిరిగానే "నీ మొహం! నీకేం తెలుసు పోదూ" అన్నాడు,

ముచ్చటగా మూడేళ్ళు డుమికీలు కొట్టి అబ్బాయిగారు ఎలా అయితేయేం బి ఎ. అయాననిపించారు. అబ్బాయి గారి బి. ఎ. చూచో. అబ్బాయి నాన్నగారి ముప్ఫై ఎకరాల మాగాణీ చూచో అ తలకుమాసిన వాడు పిల్లనిస్తానంటూ చక్కా వచ్చాడు. పోనీ యీ వెధవాయి ఆ మామగారిస్తానన్న మూడు వేల కట్నమన్నా పుచ్చుకున్నాడా? అదీలేదు- ఏదో కట్నాల పిశాచమా- వీడి పిండా........నా నోటికి మంచి మాటలుకూడా రావు - అంటూ సాగదీసు కుంటూ ఆ మూడు వేల మూటా తిరగ గొట్టాడు, అదేమిటిరా అని తెల్లబోయిన వాళ్ళ నాన్నగారితో "నీకు పిచ్చా ఏమిటి నాన్నా యీ ముష్టి మూడు వేల రూపాయలూ నేను మూడునిముషాల్లో సంపాదించనూ" అంటూ దీర్ఘాలు తీసాడు. వాళ్ళ నాన్న గారు కూడా తన సుపుత్రుడు అంత వాడవుతాడని గర్వంగా నలుగురి తోనూ చెప్పుకున్నాడు- పెళ్ళయి మూడేళ్ళయింది, యింతవరకూ మూడు వేలు కాదు గదా మూడు దమ్మిడీలయినా సంపాదించ లేకపోయాడు. ముం....ల్లే మూల కూర్చోవటం తప్ప.

ఆ పెళ్ళాంకూడా వాడికి తగిందే దొరికింది. ఎప్పుడూ ఆ గదిలో చేరి ఏక ఏకలు వెక వెకలు, చీటాటా- చదరంగం- రామ! రామ! మాకాలంలో మేమూవున్నాం గాని మరీయింత పచ్చికలా! యివతల చెంబు అవతల పెట్టని మనిషి యింటిపనులలో ఏంకల్పించుకుంటుంది. అయ్యో! యీ ముసలిముండ వక్కర్తే చేసుకుంటోందే. పోనీ యీ యిల్లూడుద్దాం- బుడల్లో కిర్సనాయిలు పోద్దాం- అని దానికెమన్నా వుందీ! కనీసం పనిచేసేది తోమిన అంట్లన్నా తొలవటానికి చేతులు పడిపోతే యింక నేనెట్లా నిబాయించగలను- అసలు నేనేమీ మాట్లాడనే మాట్లాడను. ఒకవేళ ఖర్మం చాలక "యిదేమిటే యిలా కూర్చుంటే ఎలాగే" అన్నానా యిక ప్రారంభిస్తుంది. యిల్లెగిరి పోయేటట్టు ఆరున్నొక్క రాగం. దాంతో అబ్బాయిగారు ఎగిరెగిరి పడతాడు అంట విస్తరిలా—.

అన్నీ చూస్తూనే వున్నారు వాళ్ళ నాన్న- చివరకు భరించలేక అన్నాడు. "నాయనా! నువ్వూ నీ పెళ్ళాం వేరే వుండండిరా!" అని అన్నాడంటె అనడూ తప్పా?